

ఘనంగా బుద్ధ జయంతి 9లో▸

జిల్లా వ్యాప్తంగా బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి విగ్రహాలు, చిత్రపటాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



విత్తన దుకాణాల్లో తనిఖీలు

జిల్లాలోని పలు విత్తన దుకాణాల్లో టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
42.0/21.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి గాలులు వీస్తాయి. ఉక్కపోత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధితశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఐఈవో రవీందర్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 14 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3,293 మంది, ఒకేషనల్ విద్యార్థులు 127 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 2,229 మంది, ఒకేషనల్ విద్యార్థులు 222 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్ష నిర్వహణకు 14 మంది సీఎస్‌లు, 14 మంది డీవోలు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించినట్లు వివరించారు.

ప్రశాంతంగా ఎడ్‌సెట్

ఆదిలాబాద్‌టౌన్: బీఎడ్ కోర్సుల్లో ప్రవేశానికి గురువారం జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎడ్‌సెట్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు విడతల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించారు. పరీక్షాకేంద్రానికి విద్యార్థులు గంట ముందుగా చేరుకోగా సిబ్బంది వారిని తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఉదయం జరిగిన పరీక్షకు 95 మందికి 90 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 95 మందికి 87 మంది హాజరైనట్లు పరీక్షాకేంద్రం ఇన్‌చార్జి పున్నారావు తెలిపారు.

కలెక్టర్‌కు ఆహ్వానపత్రం



కలెక్టర్‌కు ఆహ్వానపత్రం ఇస్తున్న అవంతిక

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని గోపాల కృష్ణమఠంలో ఈ నెల 25న నిర్వహించనున్న కూచిపూడి నృత్యోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ప్రముఖ కూచిపూడి నృత్య శిక్షకురాలు గంద్రత్ అవంతిక కలెక్టర్ రాజర్షి షాను కోరారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. సాయంత్రం 6గంటలకు జరిగే కార్యక్రమానికి అధికసంఖ్యలో హాజరై చిన్నారులను ఆశీర్వదించాలని కోరారు.

పెద్దదేవుడి ఊరేగింపు



భేటీ అయిన కొత్త కోడళ్లు

సిరికొండ: మండలంలోని కోసుపటేల్ గూడ గిరిజన గ్రామంలో గురువారం పెందుర్ వంశీయులు వారి ఆరాధ్య దైవం పెద్దదేవుడి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. పెందుర్‌వంశ కొత్త కోడళ్ల భేటీ అయి తమ దేవతలకు నువ్వులు, కొబ్బరినూనెతో ప్రత్యేకపూజలు చేశారు. గంగాజలంతో పెద్ద దేవుడికి జలాభిషేకం చేసి గ్రామంలో ఊరేగించారు. మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో వచ్చిన పెందుర్ వంశీయులు, గ్రామ పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రికి షోకాజ్ నోటీస్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లో గల మమత ఆస్పత్రికి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ గురువారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వైద్యారోగ్యశాఖ అధికారులు ఆస్పత్రుల తనిఖీ చేపడుతున్న విషయం తెలిసిందే. ఆస్పత్రి యాజమాన్యం నిబంధనలు పాటించకపోవడంతో నోటీస్ జారీ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. రెండురోజుల్లో ఆస్పత్రి యాజమాన్యం వివరణ ఇవ్వకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేటి నుంచి జొన్న కొనుగోళ్లు పునఃప్రారంభం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం నుంచి జొన్న కొనుగోళ్లు పునఃప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు నాణ్యత పాటిస్తూ పంచాయతీ కార్యదర్శి వద్ద టోకెన్ తీసుకురావాలని సూచించారు.

కల్యాణం.. కమనీయం

సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న జంటలు



కల్యాణోత్సవంలో భాగంగా మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



జిల్లా కేంద్రంలోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ మంగమఠంలో గురువారం శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కన్నులపండువగా నిర్వహించారు. కల్యాణ వేడుకను తిలకించడానికి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. అలాగే సత్యనారాయణస్వామి ఆలయంలో 108 జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వైభవ్‌శర్మ, ఈవో వామన్ తదితరులు పాల్గొన్నారు. – ఆదిలాబాద్

ఇసుకాసురులు!



- పెన్‌గంగను తోడేస్తున్న అక్రమార్కులు
- అడ్డగోలుగా ఇసుక అక్రమ తరలింపు
- మరబోట్ల వినియోగంతో మరీ దోపిడీ
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- అమలుకాని భూగర్భజలశాఖ ఆదేశాలు
- అడుగంటిపోతున్న భూగర్భజలాలు

మన ఇంట్లో మూలమూలల్లో దాగివున్న చెత్తను బయటకు లాగాలంటే వ్యాక్యూమ్ క్లీనర్ తప్పనిసరి. దీని ప్రస్తావన ఎందుకంటే.. ఇది వేసవి కావడంతో నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉంటుంది. ఇసుక దిబ్బలతో దర్శనమిస్తుంది. ఈ ఇసుకను కూలీలు, జేసీబీలతో తోడేసి లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తుంటారు. అనుమతి ఉంటే ఇది సాధారణ విషయమే. కానీ.. అక్రమార్కులు అనుమతి లేకుండా నది ఒడి నుంచి కూడా ఇసుక తోడేస్తున్నారు. పైచిత్రం బేల మండలం కాంగార్‌పూర్‌లోనిది. పెన్‌గంగ నదిలోకి మర బోటుతో నీటి మధ్యకు వెళ్తారు. అక్కడ జనరేటర్, బ్యాటరీల సాయంతో బోటులోంచి ఒక పైపు నది లోపలికి దించుతారు. ఇక విద్యుత్ సరఫరా చేసినప్పుడు బోరు వేసినప్పుడు ఎలా నీళ్లు, మట్టి ఉబికి బయటకు వస్తాయో.. అచ్చం అలాగే ఆ బోటులోని పైపు నుంచి ఇసుక, నీళ్లు ఉవ్వెత్తున ఎగిసివస్తాయి. వాటిని పైపుల ద్వారా ఒడ్డు వరకు చేర్చి అక్కడ జల్లెడ పడతారు. నీళ్లు కిందికి వెళ్లిపోగా, ఇసుక అక్కడ నిల్వ ఉంటుంది. ఇలా యంత్రాల ఉపయోగం జరిగే సైట్‌లలో నిత్యం 50 నుంచి 75 ట్రాక్టర్ల ఇసుకను యథేచ్ఛగా లూటీ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో మరబోటు అక్రమార్కులకు వరంగా మారింది.



బేల మండలం కాంగార్‌పూర్ వద్ద పెన్‌గంగలో ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న కూలీలు

సాక్షి, ఆదిలాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో కొత్త ఇసుక పాలసీ తీసుకురావాలని ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ ఇటీవల జిల్లాలో ఇసుక లభ్యత విషయంలో సర్వే చేయాలని నిర్ణయించారు. భూగర్భ గనులు, భూగర్భ జల, రెవెన్యూ శాఖలు దీనిపై పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రధానంగా ఇసుక లభ్యత ఉందా.. లేదా.. భూగర్భజల శాఖ నిర్ధారించాల్సి ఉంటుంది. వారు పరిశీలించి ఇసుక లభ్యతపై ఫీజుబిలిటి ఉందని నివేదిక ఇస్తే తదుపరి మైనింగ్ శాఖ ఆ సైట్‌ను నిర్ధారించి ఇసుక పాలసీ అమలు చేసేందుకు వీలుంటుంది. జిల్లాలోని భీంపూర్, జైనథ్, బేల మండలాలకు సరిహద్దులా పెన్‌గంగ ప్రవహిస్తుంది. దీంతో అక్కడ ఇసుక లభ్యత విషయమై వారు పెన్‌గంగలో పరిశీలించారు. మూడు మీటర్ల మేర ఇసుక మందం ఉన్న పక్షంలో ఒక మీటర్ మేరకు తవ్వకాలు జరుపుకోవచ్చు. అయితే పెన్‌గంగలో 0.5 నుంచి మీటర్ వరకే ఇసుక మందం ఉండగా ఇక్కడ తవ్వకాలు జరపరాదని భూగర్భజలశాఖ స్పష్టం చేసింది. దీంతో జిల్లాలో ఎక్కడా ఇసుక పాలసీ విధివిధానాలు రూపొందించే ఆస్కారం లేకుండాపోయింది.

అడ్డగోలుగా తోడేస్తున్నారు

జిల్లాలో భీంపూర్, జైనథ్, బేల మండలాలకు సరిహద్దులా పెన్‌గంగ నది పరీవాహకంగా ఉంది. జిల్లా పరిధిలో సుమారు 70కిలో మీటర్ల మేర ఇది వ్యాపించి ఉంది. ఈ మూడు మండలాల్లో పలుచోట్ల అక్రమార్కులు కూలీలు, జేసీబీలు, మర బోట్లతో అడ్డగోలుగా ఇసుక తోడేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడా లోతైన గుంతలు తీస్తున్నారు. ప్రధానంగా చెలిమె తోడినప్పుడు నీళ్లు అందులోకి వస్తాయి. అలాగే ఇసుక తీసినప్పుడు పెన్‌గంగలో గుంతలు ఏర్పడి నీరు జారిపోయే పరిస్థితి ఉంటుంది. క్రమక్రమంగా పెన్‌గంగ లోతు పెరిగిపోతుందని, భూగర్భజలాలు అడుగంటే పరిస్థితి ఉంటుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. అందుకే మందం ఉన్న చోటనే ఇసుక తీయాలనే నిబంధన విధించారు. పెన్‌గంగలో ఆ పరిస్థితి లేకపోయినా దాదాపు 12 నుంచి 15 చోట్ల ఇసుక సైట్‌లను ఏర్పాటు చేసి అడ్డగోలుగా ఇసుకను తవ్వుతున్నారు. నిత్యం సుమారు 500 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.

దోపిడీ జరుగుతున్న ప్రాంతాలు

బేల మండలంలోని సాంగిడి, కాంగార్‌పూర్, మాంగుర్ల, కొగ్దూర్, జైనథ్ మండలంలో ఆనంద్‌పూర్, పెండల్‌వాడ, డొల్లార, సాంగ్విలలో పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిపోతోంది. జైనథ్ మండలంలోని కౌట, పూసాయి, పిప్పర్‌వాడ, కామాయి నుంచి కొద్దిమొత్తంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అలాగే భీంపూర్ మండలంలోని గుబిడి, అంతర్గాం, వడూర్, తాంసి(కె) నుంచి కూడా ఇసుక అక్రమంగా తరలుతోంది.

వీడీసీల పేరిట వేలం..

జిల్లాలో ఇసుక పాలసీ లేకపోవడంతో ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం సమకూరే పరిస్థితి లేదు. దొడ్డి దారిన గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ల పేరిట వేలం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా స్థానిక అవసరాలకు ఇసుక ఉపయోగిస్తామని నమ్మబలుకుతూ వేలం వేస్తున్నారు. ఇదివరకు ఓ స్థాయిలో జరిగిన వేలం ఇప్పుడు ఏడాదికి రూ.50లక్షలకు దాటిపోయింది. ఇటీవల బేల మండలం కాంగార్‌పూర్‌లో రూ.62లక్షలు పలకడం గమనార్హం. ఇక్కడి నుంచి నిత్యం 50కి పైగా ట్రాక్టర్లు, 10–20 టిప్పర్ల ఇసుక ఆదిలాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు తరలివెళ్తోంది. కళ్ల ముందే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా నియంత్రించాల్సిన రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు 'మామూలు'గా తీసుకుంటున్నాయి. దీంతో అక్రమార్కులకు ఇసుక దోపిడీ కాసులు కురిపిస్తోంది.

ఇసుక లేదని నివేదించాం



వాల్టా చట్టం ప్రకారం పెన్‌గంగలో ఇసుక లభ్యత లేదు. అక్కడ ఫీజుబులిటి లేదని మా శాఖ నుంచి నివేదిక ఇచ్చాం. గత నెలలో మూడు మండలాల్లోని పెన్‌గంగ పరీవాహక ప్రాంతాలను పరిశీలించాం. సర్వే చేసి ఇసుక లభ్యత లేదని గుర్తించాం.
– శ్రీవల్లి, ఏడీ, భూగర్భజల శాఖ

కఠిన చర్యలు తప్పవు



పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా చేయడం నేరం. మార్చి నుంచి మే వరకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 38 వాహనాలు పట్టుకుని వాటి యజమానులకు రూ.5.13 లక్షల జరిమానా విధించాం. ఇసుక అక్రమంగా తవ్వినా, రవాణా చేసినా కఠినచర్యలు తప్పవు. – రవీందర్, ఇన్‌చార్జి ఏడీ, భూగర్భగనుల శాఖ

నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలి

- అధికారులతో కలెక్టర్ రాజర్షి షా
- అమ్మ ఆదర్శ పాఠశాల పనుల ప్రగతిపై సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులు ఈ నెల 31లోపు పూర్తిచేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పనుల ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ పాఠశాలలు, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో టాయిలెట్స్ మరమ్మతులు, పెయింటింగ్, మౌలిక వసతుల కల్పన పనులన్నీ నాణ్యతతో చేపట్టాలని సూచించారు. వర్షాలు కురిసే సమయాల్లో లీకేజీలుంటే సరిచేయాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు అత్యవసరమైన పనులను గుర్తించి వాటిని పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పనులు ప్రారంభించని చోట త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీవో, ఈఈ, ఎంఈవో, ఏపీఎంలు టీమ్‌గా వెళ్లాలని సూచించారు. ఈజీఎస్‌లో చేపడుతున్న పనులపై దృష్టి సారించాలని, ముఖ్యంగా టాయిలెట్స్ మరమ్మతులు, నిర్మాణ పనులపై డీపీవో, సీఈవోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. పనులను నిర్లక్ష్యం చేసినా, గడువులోపు పనులు పూర్తి చేయకపోయినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో రత్నమాల, డీపీవో శ్రీలత, డీఈవో ప్రణీత, డీటీడబ్ల్యూవో దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆర్‌అండ్‌బీ, పీఆర్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఈఈలు నర్సయ్య, వెంకట్‌రావు, అశోక్, పెయింటింగ్స్ ఏజెన్సీల వారు పాల్గొన్నారు.

నేడు పాలిసెట్

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు, వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి శుక్రవారం నిర్వహించనున్న పాలిసెట్ పరీక్షకు ప్రభుత్వ సంజయ్‌గాంధీ కళాశాల యాజమాన్యం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా కేంద్రంలోని విద్యార్థి డిగ్రీ కళాశాల, ఆర్ట్స్ అండ్ కామర్స్, నలంద డిగ్రీ కళాశాలల్లో పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు ముగ్గురు అబ్జర్వర్లను నియమించారు. 1,059 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. గంట ముందుగానే కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని పాలిసెట్ సమన్వయకర్త భరద్వాజ తెలిపారు. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాన్ని అబ్జర్వర్ జ్యోత్స్న గురువారం పరిశీలించారు.



ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో పాలిసెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ జ్యోత్స్న

కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

ఉట్నూర్‌రూరల్: వరి ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సూచించారు. బుధవారం మండలంలో జోరుగా వర్షం కురియడంతో ఆమె గురువారం పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల సిబ్బంది అప్రమత్తతతో అధికశాతం నష్టం జరగలేదని తెలిపారు. ముస్ముందు వానలు కురియక ముందే కొనుగోళ్లు పూర్తి చేసేలా చూడాలని సూచించారు. మండలంలోని ఉట్నూర్, బీర్సాయిపేట, కొనుగోలు కేంద్రాలు, గోదాములను పరిశీలించారు. అనంతరం మండల స్థాయి గిడ్డంగిని పరిశీలించి బియ్యం నిల్వలు సక్రమంగా ఉంచాలని, నిర్ణీత తేదీలోపు చౌకధరల దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లు, ప్రభుత్వ వసతిగృహాలకు సరఫరా చేయాలని సూచించారు. ఆమె వెంట డీపీఎం శోభారాణి, బీఎం సంధ్యారాణి, డీటీ త్రియంబక్, ఏఈవో సాయికృష్ణ, సుధాకర్ తదితరులున్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మీనంపై భానుడి ప్రతాపం

- ఎండల తీవ్రతకు చనిపోతున్న చేపలు
- అడుగంటిన చెరువులు, రిజర్వాయర్లు
- ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు



బజార్‌హత్నూర్ మండలం దేగామ చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు

కైలాస్‌నగర్: జిల్లాలోని మత్స్యకారుల జీవనోపాధిపై భానుడి ప్రభావం పడింది. పలు మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటాయి. మార్చి ఆరంభం నుంచే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండగా ఇప్పటికే జిల్లాలోని చిన్న చెరువులు ఎండిపోయాయి. ఏడాది పాటు చేపలు పట్టుకునే అవకాశముండే ప్రధాన రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి చేరాయి. ఫలితంగా వాటిలోని చేపలు బరువు తగ్గిపోతున్నాయి. ఆక్సిజన్ అందక చనిపోతున్నాయి. వాటిపై ఆధారపడి జీవించే మత్స్యకారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. ఎండల కారణంగా మిగతా చేపలు కూడా మరణించే అవకాశమున్నందున మత్స్యకారులు వాటిని వెంటనే పట్టుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అడుగంటిన చెరువులు

ఆదిలాబాద్ జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 240 చెరువులున్నాయి. వీటిలో ఈ ఏడాది 1.20 కోట్ల చేపపిల్లలు వదలాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. నీటి లభ్యత ఆధారంగా 216 చెరువుల్లో కట్ల, రాహు, బంగారు తీగ రకాలైన 1.18కోట్ల చేప పిల్లలు వదిలారు. వీటి ద్వారా ఈ ఏడాది 5–6 టన్నుల చేపలు ఉత్పత్తి అయ్యే అవకాశముందని అంచనా వేశారు. అనుకున్నట్లే చెరువుల్లో చేపల సంతతి కూడా పెరిగింది. కానీ.. ప్రస్తుతం భానుడి ప్రతాపంతో జిల్లాలోని తక్కువ వ్యవధి కలిగిన చెరువులన్నీ అడుగంటిపోయాయి. మూడు నెలలు, ఆరునెలల పాటు చేపలు పట్టుకునే అవకాశమున్న చెరువులన్నింటిలో నీరు అడుగంటింది. వాటిలోని చేపలను మత్స్యకారులు ఇదివరకే పట్టుకున్నారు. గతేడాది ఏప్రిల్ వరకు ఆ చెరువుల్లో చేపలు పట్టుకోగా.. ఈసారి ఎండల తీవ్రతకు మార్చి ఆరంభంలోనే అడుగంటిపోయాయి. ఫలితంగా చేపలు పట్టుకునే అవకాశం కోల్పోయి మత్స్యకారులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

డెడ్‌స్టోరేజీకి రిజర్వాయర్లు

ఏడాది పొడవునా చేపలు పట్టుకునే అవకాశమున్న ప్రధాన రిజర్వాయర్లు ఆదిలాబాద్ జిల్లాలో ఎనిమిది ఉన్నాయి. తాంసి మండలంలోని మత్తడివాగు, జైనథ్ మండలంలోని సాత్నాల, బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ ప్రాజెక్ట్‌లతో పాటు జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ రిజర్వాయర్, ఉట్నూర్‌లోని చెరువు, బోథ్ మండలంలోని కరత్వాడ, తలమడుగు మండలంలోని కజ్జర్ల, భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ పంచాయతీ పరిధి జెండాగూడ చెరువులు మత్స్యకారులకు ప్రధాన జీవనోపాధినిస్తున్నాయి. వీటిలో కట్ల, మృగాల, రాహు లాంటి రకాలైన చేపలతో పాటు రొయ్యలు వేశారు. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇప్పటికే ప్రధాన రిజర్వాయర్లన్నింటిలోనూ నీరు అడుగంటి డెడ్‌స్టోరేజీకి చేరాయి. ఫలితంగా రిజర్వాయర్లన్నీ బురదమయంగా మారి వాటిలోని మిగిలిన చేపలకు ఆక్సిజన్ అందక మృత్యువాత పడే ప్రమాదమేర్పడింది. ఇప్పటికే పలుచోట్ల చేపలు చనిపోయిన ఘటనలూ ఉన్నాయి. ప్రస్తుతం ఎండలు భగ్గుమంటుండటంతో చేపలు బరువు కూడా తగ్గే అవకాశముంది. ఈ ఏడాది పూర్తిస్థాయిలో చేపలు పట్టే అవకాశం లేక జిల్లాలోని మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి దాపురించింది.

వెంటనే పట్టుకోవాలి

అధిక సాంద్రత, ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గుల కారణంగా రోగకారక సూక్ష్మ క్రిముల బారిన పడిన చేపలు ఆకస్మికంగా చనిపోయే ప్రమాదముంది. మత్స్యకారులు కొన్ని యాజమాన్య పద్ధతులు పాటించి వాటిని కాపాడుకోవాలి. చెరువులోని నీటి నాణ్యత, లోతు, విస్తీర్ణం, చేపల కదలికలను రోజూ గమనించాలి. ఉదయం చెరువు పైభాగాన చేపలు నోరు తెరిచి కనిపిస్తే వాటికి ప్రాణవాయువు కొరత ఉందని గమనించి వెంటనే వాటిని పట్టుకోవాలి. – వై.సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

క్లుప్తంగా

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీసు స్టేషన్‌ పరిధిలోని పోలీసు కాలనీలో గల హనుమాన్‌ ఆలయం, అదే కాలనీకి చెందిన టేకం రామారావు ఇంట్లో ఈనెల 21న జరిగిన చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్‌ సీఐ ఫణిధర్‌ తెలిపారు. గురువారం మావల పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. హనుమాన్‌ ఆలయంలో హుండీలోని రూ.6వేల నగదు, రామారావు నివాసంలో 2 గ్రాముల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన డి.శ్యామ్‌, ఆదిలాబాద్‌ పట్టణంలోని చిల్కూరి లక్ష్మినగర్‌కు చెందిన అబ్దుల్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన మరో ఇద్దరు ఫారుఖ్‌, ఫేరోజ్‌ ఇందులో భాగస్వాములని తేలిందన్నారు. శ్యామ్‌, అబ్దుల్‌ను అరెస్టు చేశామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై విష్ణువర్ధన్‌, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

దస్తురాబాద్‌: ఆదిలాబాద్‌ ఎక్సైజ్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఎర్రగుంట, మున్యాల తండా, రేవోజీపేట గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐలు గంగారెడ్డి, ఎండీ అక్బర్‌ హుస్సేన్‌ తెలిపారు. దాడుల్లో 216 లీటర్ల నాటుసారా, 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు. నిర్మల్‌ ఎక్సైజ్‌ సీఐ లక్ష్మణ్‌రావ్‌, ఎస్సైలు వసంత్‌రావ్‌, గజేందర్‌, సింధు, ఎక్సైజ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ చోరీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎస్సార్‌ పెట్రోల్‌ బంక్‌లో బైక్‌ చోరీకి గురైంది. బజార్‌హత్నూర్‌ మండల కేంద్రానికి చెందిన అంగ శ్రీనివాస్‌ ఈ నెల 17న తన ద్విచక్ర వాహనాన్ని ఎస్సార్‌ పెట్రోల్‌ బంక్‌ ముందు పార్క్‌ చేసి నిర్మల్‌కు వెళ్లాడు. గురువారం నిర్మల్‌ నుంచి ఇచ్చోడకు వచ్చి చూడగా బైక్‌ కనిపించక పోవడంతో స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్‌: నిర్మల్‌ జిల్లాకు చెందిన యువతి (21) ఆదిలాబాద్‌ ఆర్టీసీ బస్టాండ్‌లో అదృశ్యమైంది. గురువారం ఉదయం నిర్మల్‌ నుంచి జిల్లా కేంద్రంలో బీఎడ్‌ పరీక్ష రాయడానికి తన తండ్రితో కలిసి ఆదిలాబాద్‌కు వచ్చారు. బస్టాండ్‌లో కాలకృత్యాలు తీర్చుకుంటానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో యువతి తండ్రి టూటౌన్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లాల్‌సింగ్‌ నాయక్‌ తెలిపారు.

బొలెరోను ఢీ కొట్టిన ఆటో

నర్సాపూర్‌ (జి): మండలంలోని నసీరాబాద్‌ 61వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... నర్సాపూర్‌ (జి)మండల కేంద్రం నుంచి ఐదుగురు మహిళలు, ఒక బాలుడు రాంపూర్‌ గ్రామానికి ఆటోలో బయలుదేరారు. నసీరాబాద్‌ 61వ జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న బొలెరోను ఢీకొన్న ఆటో బోల్తా పడింది. సాయవ్వ అనే మహిళకు తీవ్రంగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నిర్మల్‌ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

మండపంలో కొలువుదీరిన ఉత్సవ మూర్తులు



మాంగల్యధారణ చేస్తున్న పూజారులు



డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కమనీయం.. లక్ష్మీనరసింహుని కల్యాణం

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న యువతి



కల్యాణానికి హాజరైన భక్తులు

దిలావర్‌పూర్‌: మండలంలోని కాల్వ గ్రామ పరిసర అటవీప్రాంతంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహుడి కల్యాణాన్ని గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం నిత్యార్చన, అగ్ని ప్రతిష్ఠ, యజ్ఞాది కార్యక్రమం, మధ్యాహ్నం ధ్వజారోహణం, బలిహరణము, గరుడ ముద్దల కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 31 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. కల్యాణాన్ని వీక్షించేందుకు వివిధ గ్రామాల నుంచి దాదాపు 25 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్‌ పూజారం మహేశ్‌ భక్తులకు ఏర్పాట్లు చేశారు. నిర్మల్‌ సీఐ శ్రీనివాస్‌, దిలావర్‌పూర్‌ ఎస్సై సుమాంజలి బందోబస్తు నిర్వహించారు.

పలువురి ప్రత్యేక పూజలు...

డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ ఎర్ర రఘునందన్‌రెడ్డి, కదిలి ఆలయ కమిటీ చైర్మన్‌ నార్వాడి వెంకట్‌రావు, నాయకులు పాల్దె అనిల్‌, రాజేందర్‌, మాజీ చైర్మన్‌ ఇప్ప నర్సారెడ్డి, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

అదుపుతప్పి ప్రైవేటు బస్సు బోల్తా



బోల్తాపడిన ముస్కాన్‌ ట్రావెల్స్‌ బస్సు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అలీమొద్దీన్‌

- ఒకరు మృతి
- ఐదుగురి పరిస్థితి విషమం
- 20 మందికి స్వల్ప గాయాలు

సారంగాపూర్‌/ఇంద్రవెల్లి: మండలంలోని రాణాపూర్‌ సమీపంలోని మహబూబాఘాట్స్‌ సమీపంలో బుధవారం రాత్రి ప్రైవేట్‌ బస్సు బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండగా 24 మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రానికి చెందిన ముస్కాన్‌ ట్రావెల్స్‌ బస్సు ఆదిలాబాద్‌ నుంచి బుధవారం రాత్రి 49 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. మహబూబాఘాట్స్‌ వద్దకు చేరుకోగానే బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలు కాగా 24 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్‌ గ్రామానికి చెందిన షేక్‌ ఆఫ్రిన్‌ అలియాస్‌ షేక్‌ ఫర్హానా (29) అనే మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు, మిగతా ముగ్గురిని రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. బస్సు డ్రైవర్‌ ఇర్ఫాన్‌ అహ్మద్‌ పరారయ్యాడని ఎస్సై చంద్రమోహన్‌ తెలిపారు. డ్రైవర్‌ అతివేగం, అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగినట్లు గుర్తించామని ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త ఫయాజ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షేక్‌ సలీమా

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

సోన్‌: మండలంలోని మాదాపూర్‌ ఐబీ వద్ద గురువారం కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌ నుంచి ఆదిలాబాద్‌ వెళ్తున్న కారు మాదాపూర్‌ ఐబీవద్ద 44వ జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సాయిని రవి, సిద్దిక్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌ సతీష్‌ అజాగ్రత్తగా కారు నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకుందన్నారు. బాధితుని సోదరుడు సాయిని ప్రవీన్‌ కుమార్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సంతోషం రవీందర్‌ తెలిపారు.



బోల్తా పడిన కారు

బల్దియాకు అవినీతి మరక..!

- కమిషనర్‌ వ్యవహారంతో వెలుగులోకి..
- ఇతర శాఖల్లోనూ ఆమ్యామ్యాలు

భైంసాటౌన్‌: భైంసా మున్సిపాలిటీకి అవినీతి మరక అంటింది. కమిషనర్‌ వెంకటేశ్వర్లు, బిల్‌ కలెక్టర్‌ విద్యాసాగర్‌ రూ.30 వేలు లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీకి పట్టుబడిన విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. బాధితుడు ధైర్యంగా ఏసీబీని ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కమిషనర్‌ కార్యాలయంలో తనకు అనుకూలంగా ఉండే ఇద్దరు ఉద్యోగులతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్య విభాగంలో పనిచేసే ఓ జవాన్‌ సహకారంతో పట్టణంలో నూతన భవన నిర్మాణాలు, వాటి అనుమతులు, పన్నుల్లో లొసుగులను ఆధారంగా చేసుకుని భవన యజమానులకు నోటీసులు జారీచేసి బెదిరింపులకు పాల్పడేవారని మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ ఆరోపించడం గమనార్హం. సదరు నోటీసులు సైతం కార్యాలయంలో సిబ్బందితో కాకుండా బయటి నుంచే తయారు చేయించడం, తనకు అనుకూలమైన ఉద్యోగులతో కలిసి డబ్బులు డిమాండ్‌ చేసేవారని తెలుస్తోంది. ఎంత మందిని ఇలా బెదిరించి డబ్బులు వసూల చేశారో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గం దృష్టికి రాకుండా గృహ, వాణిజ్య భవనాల పన్నులు, ట్రేడ్‌ లైసెన్స్‌, ఇతర వాటిల్లోనూ నిబంధనల మేరకు పన్ను మదింపు లేదన్న కారణంతో నోటీసులు జారీ చేయడం, అడిగినంత ఇచ్చుకుంటే చూసీచూడనట్లు వ్యవహరించేవారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇక బల్దియలో కొందరు ఉద్యోగులు విధులు రాకున్నా.. వేతనం పొందేలా సహకరించారని, తద్వారా వారి నుంచి లబ్ధి పొందారని వైస్‌చైర్మన్‌ ఆరోపించారు. కమిషనర్‌ వ్యవహారంతో భైంసా బల్దియాకు చెడ్డ పేరు వచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అన్ని శాఖల్లోనూ ఆమ్యామ్యాలు...

దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ అవినీతి రాజ్యమేలుతోంది. కొందరు అవినీతి అధికారులు, ఉద్యోగులు చేయి తడపనిదే ఏ పని చేయరన్న ఆరోపణలున్నాయి. ప్రతీ కార్యాలయంలో ప్రతీ పనికి ఓ రేటు ఉంటుందన్నది బహిరంగ రహస్యమే. అధికారి అడిగినంత ఇవ్వకుంటే తమ పని ఎక్కడ ఆగిపోతుందోనన్న భయంతో చాలామంది ఫిర్యాదు చేసేందుకు సాహసించడం లేదు. ఇదే అవినీతి అధికారులు, ఉద్యోగులకు కలిసివస్తోంది. బల్దియా కమిషనర్‌పై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతోనే కమిషనర్‌ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇతర ప్రభుత్వ శాఖల్లోనూ లంచావతారులున్నా ధైర్యంగా ఫిర్యాదు చేస్తే అసలు బాగోతాలు వెలుగులోకి వచ్చే అవకాశముంటుంది.

'నష్టపోయిన బాధితులను ఆదుకుంటాం'



పరిశీలిస్తున్న ఆత్రం సుగుణ

తలమడుగు: అకాల వర్షాలతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ కాంగ్రెస్‌ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ భరోసానిచ్చారు. గురువారం మండలంలోని పునగుడ, ఝరి, మందగుడ, ఉమ్రీ గ్రామాల్లో పర్యటించారు. ఇళ్లు కూలిపోయి, పంటలు నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని భరోసానిచ్చారు. అనంతరం ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్‌ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. ఆమె వెంట కాంగ్రెస్‌ బోథ్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ దివ్య మాధవ్‌, ఎంపీటీసీ రమేశ్‌రెడ్డి, సింగిల్‌ విండో మాజీ చైర్మన్‌ ప్రకాష్‌ రావు, మాజీ సర్పంచ్‌లు గంగారం, రఘు, తిరుపతి, మాజీ ఎంపీపీ సిడాం రాము, తదితరులు ఉన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ

ఖానాపూర్‌: పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌ ధనరాజ్‌ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవల వివరాలు, సర్వీస్‌ చార్జీలు, ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ల అర్హత వివరాలు, రిజిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌ రిసెప్షన్‌ ప్రాంతంలో ప్రదర్శించాలని ఆదేశించారు. అన్నిరకాల రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహించే వారిపై, నిబంధనలు పాటించని ఆస్పత్రులపై క్లినికల్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ యాక్ట్‌ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని సింధుశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌, ఖాజ హాస్పటల్‌కు నోటీసులు జారీ చేశారు. డీఎంహెచ్‌వో వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్‌ రాజేందర్‌, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారే రవీందర్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ సంతోష్‌ తదితరులు ఉన్నారు.



ప్రైవేట్‌ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ధన్‌రాజ్‌

నిర్మల్‌ బృందానికి నృత్య పురస్కారం



పురస్కారాలతో వెన్నెల డ్యాన్స్‌ అకాడమీ నృత్య బృందం సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన ఇండియన్‌ డ్యాన్స్‌ ఫెస్టివల్‌ కార్యక్రమంలో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనకు గానూ నిర్మల్‌ జిల్లాకు చెందిన నాట్య బృందానికి పురస్కారం లభించింది. వెన్నెల డ్యాన్స్‌ అకాడమీకి చెందిన నృత్య బృందం డీవన్‌ టైటిల్‌ విన్నర్‌ ఫేమ్‌ హరినాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఇండియన్‌ ఎక్సలెన్స్‌ పురస్కారం, ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డ్యాన్స్‌ మాస్టర్‌ ధనరాజ్‌, నాట్యప్రదర్శన బృందం సభ్యులు నిహారిక, సాయికృప, తార, అన్విక, శ్రీ మహిత, ఇందూ, నిహారిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని ఫిల్టర్‌ బెడ్‌కు చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు మహారాష్ట్రలోని సైలానిబాబా దర్గాను దర్శించుకునేందుకు బుధవారం రాత్రి కారులో బయల్దేరి వెళ్లారు. దర్శనం చేసుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో వాసిమ్‌ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు పెద్దలతో పాటు మరో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి.

కారును ఢీకొన్న బైక్‌..



గాయాల పాలైన యువకుడు

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని బస్‌డిపో వద్ద గురువారం ఉదయం బైక్‌పై వేగంగా వచ్చిన ఓ యువకుడు యూటర్న్‌ తీసుకునే క్రమంలో కారును బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో యువకుడిని చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్‌ చేశారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

భైంసారూరల్‌: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌ తెలిపిన వివరాల మేరకు లోకేశ్వరం మండలంలోని బిలోలి గ్రామానికి చెందిన నల్లోల్ల లక్ష్మణ్‌ (30) మూడు నెలలుగా మాటేగాంలో ఉంటున్నాడు. ఇటీవలే బిలోలిలో ఉన్న తన ప్లాటుకు సంబంధించి వాగ్వాదం జరిగింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఇంట్లోనూ తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహానికి భైంసా ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన సూర్యవంశీ అంబదాస్‌ (43) రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. వన్‌టౌన్‌ ఏఎస్సై దైవశాల తెలిపిన వివరాల ప్రకారం.. చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన అంబదాస్‌ కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈనెల 21న కూలీ పనికి వెళ్లి రాత్రి 8 గంటల ప్రాంతంలో శివాజీ చౌక్‌ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కారు ఢీకొని గేదెకు గాయాలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఓ కారు గేదెను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. నిర్మల్‌ నుంచి ఆదిలాబాద్‌ వైపు కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కారులోని బెలూన్‌ ఓపెన్‌ కావడంతో ప్రాణాలతో బతికి బయటపడ్డారు. ఆ కారు వెనకాల మరో కారు ఆగడంతో వెనుకనుంచి ఐచర్‌ ఆ కారును ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న వారికి చిన్నపాటి గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు ఐచర్‌ వాహనంతో పాటు డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నిర్మల్‌రూరల్‌: మండలంలోని మంజులాపూర్‌ గ్రామ శివారులో గురువారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్‌ ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేసి నిందితుల వద్ద నుంచి రూ.17,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

దారికాచి దోచేస్తున్నారు

- పోలీసులకు పట్టించిన వాహన చోదకులు

సారంగపూర్‌: ప్రధాన రహదారులే లక్ష్యంగా చేసుకుని వాహనాలపై ప్రయాణించే వారిపై దాడిచేసి దోచుకుంటున్న ముఠా బుధవారం రాత్రి పట్టుబడింది. వాహనచోదకులే అప్రమత్తమై దారిదోపిడీకి ప్రయత్నించిన ఇద్దరిని చితకబాది పోలీసులకు అప్పగించారు. నిజామాబాద్‌ జిల్లా ఆర్మూర్‌ పట్టణంలోని పెర్కిట్‌కు చెందిన మొహమ్మద్‌ ఓవెస్‌, మొహమ్మద్‌ అంశార్‌ తమ ఆటోలో జనరేటర్‌ రిపేర్‌ చేయించడానికి పెర్కిట్‌ నుంచి ఇచ్చోడకు బయల్దేరి వెళ్లారు. ఈక్రమంలో మార్గమధ్యలో మహబూబాఘాట్స్‌ వద్ద రాత్రి మాటేగాంకు చెందిన అర్కల రంజిత్‌, పేంపల్లికి చెందిన జల్ల లక్ష్మణ్‌ మాటువేసుకుని ఉన్నారు. ఆటో అక్కడికి రాగానే బండరాళ్లతో దాడికి తెగబడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దర్ని బెదిరించి వారి వద్ద నుంచి రూ.200 లాక్కున్నారు. అదే సమయంలో మరో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిపై దాడికి ప్రయత్నించగా వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. అది గమనించిన మొహమ్మద్‌ అంశార్‌, మొహ్మద్‌ ఓవెస్‌ ద్విచక్ర వాహన చోదకులను ఆపి వివరాలు తెలిపారు. నలుగురు కలిసి దాడికి పాల్పడ్డ దొంగలను చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితులు అర్కల రంజిత్‌, జల్ల లక్ష్మణ్‌లను గురువారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. కోర్టు ఆదేశాలతో వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.